# ఈ ప్రశ్నకు బదులేది?

అనిల్‌కుమార్ కాంపౌండు గేటు తీసుకొని లోపలికి ప్రవేశించగనే,

"బాబూ! నీకో ఉత్తరం వచ్చింది" అంటూ ఒక కవరు అందించింది నాగరత్నమ్మకారు.

ఆమె ఆ ఇంటి యజమానురాలు. ఆమె, ఆమె భర్త తప్ప ఆ ఇంట్లో మరెవ్వరూ లేరు. ఆమె ఇద్దరు కొడుకుల్లో ఒకరు ఢిల్లీలోను, మరొకరు కలకత్తాలోనూ ఉన్నతోద్యోగాలు చేస్తున్నారు. అనిల్‌కుమార్ మీద ఆమెకు సదభిప్రాయముంది. కారణం అతని నడవడిక, క్రమశిక్షణ ఆమెను ఆకర్షించడమే.

అనిల్‌కుమార్ మేడ వెనుక వైపుకు వెళ్ళి మెట్లెక్కి మేడ మీదున్న తన గదిని చేరుకున్నాడు. అలసటగా కుర్చీలో కూర్చొని ఉత్తరం చించాడు....

"చిరంజీవి అనిల్‌కుమార్‌కి మీ తండ్రి ఆశీర్వదించి వ్రాయడం-

ఇక్కడ మేము క్షేమముగా ఉన్నాము. నీ క్షేమములు తెలియరావడం లేదు. నీవు పోయిన నెలలో పంపిన డబ్బు అందినది. ఈ ఉత్తరం వ్రాయడానికి ముఖ్య కారణం, ఇక్కడ నీకు పెళ్ళి సంబంధాలు వస్తూండడమే. ఇరవై వేల నుంచి అరవై వేల వరకు కట్నం ఇస్తామంటున్నారు. నిన్న బిట్రగుంట నుంచి ఒకాయన మన వూరికి వచ్చాడు. మనకు దూరపుబంధువు. నీకు వరసకు మామ అవుతాడు. వాళ్ళ అమ్మాయిని ఇస్తామంటున్నాడు. అమ్మాయి పేరు వసంత. కట్నం యాభై వేలు డబ్బు, ముప్పై

అయిదు సవర్లు బంగారం పెడతానంటున్నాడు. అంటే లక్ష రూపాయల ఆస్తన్నమాట.

దీనికి మేము సుముఖంగా ఉన్నాము. అమ్మాయిని చూస్తే గాని ఏ విషయం చెప్పమని చెప్పాను. వచ్చే నెల పదవ తేది పెళ్ళి చూపులకు నిర్ణయించాము. మీ అమ్మ ఈ పెళ్లికి చాలా ఇష్టపడుతూ ఉంది. కనుక నీవు తొమ్మిదవ తేదీ మన వూరికి వస్తే, ఇక్కడి నుంచి వెళ్ళి అమ్మాయిని చూసి ఏ విషయమూ నిర్ణయిస్తాము. అట్లాకాదు మమ్మల్నే వెళ్ళి చూసి రమ్మన్నా ఆరోజు వెళ్ళి చూసి వస్తాము. ఏసంగతికీ వెంటనే జవాబు వ్రాయి. ఈ సంవత్సరంలోగా కోడలిని తెచ్చుకోవాలని మీ అమ్మ చాలా పట్టుదలగా ఉంది. ఇక నీ ఇష్టం.

ఇట్లు,

నీ తండ్రి

నరసయ్య.

అనిల్‌కుమార్‌కి మనసు మనసులో లేదు. అతనికి ఆడవాళ్ళంటేే తగని సిగ్గు. ఇంకో రకంగా ఏహ్యభావం. ఉండడానికి వయస్సు ఇరవై ఆరేళ్ళున్నా ఆడదాని విషయానికొస్తే ఆరేళ్ళ లోపే అనవచ్చు ఇప్పటికీ పదేళ్ళుమించిన అమ్మాయిని తేరిపార చూడాలన్నా సిగ్గు. తలవంచుకుని వెళ్ళిపోతుంటాడు. హైస్కూలు నుంచి కాలేజీ వరకు కో ఎడ్యుకేషన్ కాలేజీలో చదవలేదు. నవల్లు కథలు చదివే అలవాటు అసలే లేదు. దాంతో అతను సొసైటీలో ప్రధమపాత్ర వహించే సోషల్ రిలేషన్స్‌కు దూరమయ్యాడు.

అయితే అనిల్‌కుమార్‌కు తన స్నేహితులు ఎందుకు అలా అమ్మాయిల గురించి కబుర్లు చెప్పుకుంటారో అర్థమయ్యేది కాదు. 'ఛ' ఎందుకురా ప్రొద్దస్తమానం ఆడపిల్లల గురించి కబుర్లు? 'అనే

వాడు. 'నువ్వో వెధవ్వి ఎవరినయినా ప్రేమించి చూడు. అప్పుడు తెలుస్తూంది అందులోని మజా' అనేవారు. కాలక్రమంలో అతని స్నేహితుడు రాఘవరావు ప్రేమలో పడి. ఆ అమ్మాయి వేరొకరిని పెళ్ళిచేసుకోవడంతో ట్రెయిన్ క్రింద తలపెట్టి మరణించాడు. దీంతో అతనికి అడపిల్లలమీదున్న ఏహ్యాభావం ద్వేషంగా మారింది. అందుకే అమ్మాయి లంటే తగని మంట.

అనిల్‌కుమార్‌కి ఈ మధ్యనే బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసరుగా అపాయిమెంటు వచ్చింది. ట్రెయినింగు పూర్తి కాగానే ఇక్కడ బాంకులో ఆఫీసరుగా వేశారు.

ఎలా ఈగండం తప్పించుకోవాలా అనుకొంటూ ఆలోచనలోపడ్డ అనిల్‌కుమార్ చీకటిపడడడం, తనూ చీకట్లో కూర్చుని ఉండడం గమనించి, గదిలో లైటువేశాడు. తరువాత ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని మెస్సుకు బయలుదేరాడు. మెస్సు నుంచి అటే సెకండ్ షో సినిమాకు పోవాలని అతని నిర్ణయం.

అనిల్‌కుమార్ సెకండ్ షో సినిమా చూసి గదిని చేరుకునే సరికి ఒంటిగంట అయింది. బైట లైటు స్విచ్ నొక్కాడు. లైటు వెలగలేదు. ఏమిటా అని పెన్ టార్చివేసి చూస్తే దానికి బల్బు లేదు. "చాలా విచిత్రంగా ఉందే, ఇలా ఎప్పుడూ జరగ లేదు"అనుకొంటూ తాళంతీశాడు. గది లోపలకి రెండడుగులు వేసి స్విచ్ నొక్కడానికి చేయెత్తాడు. అంతలో వెనక నుంచి ఒక ఆకారం అతన్ని బలంగా పట్టుకొంది. ఆ ఆకారమే స్విచ్ దగ్గరున్న అతని చేతిని లాగేసింది. అనిల్‌కుమార్ తనేదో గొప్ప ప్రమాదంలో చిక్కుకొన్నట్లు గ్రహించాడు.

"ఎవరు నువ్వు?" వణకుతున్న కంఠంతో అన్నాడు.

ఆ అదృశ్య వ్యక్తి అనిల్‌కుమార్‌ని వదలకుండానే ఒక చేతితో గది తలుపు దగ్గరకు లాగి గడియవేసింది. తరువాత అదే

చేతితో స్విచ్ నొక్కింది మెర్క్యూరీ లైటు కాంతిలో తనను పట్టుకున్న వ్యక్తిని చూడగానే కెవ్వున కేకవేసి దూరంగా జరిగాడు అనిల్ కుమార్. తనను యమలోకంలో భటులు మంటల్లోకి నెట్టినట్లు గిలగిలలాడిపోయాడు. ఇంతకీ ఆ ఆకారం ఒక ఇరవై ఏళ్ళ సుందరాంగి.

ఎఱ్ఱని శరీరచ్ఛాయతో సన్నగా పొడవుగా నాజూగ్గా ఉంది. విశాలమైన కనుబొమలు. చేపల్లాంటి కళ్ళు కళ్ళకు కాటుక పెట్టి ఉంది. పెదిమలకు లిప్‌స్టిక్ వేసి ఉంది. ఆమె ధరించిన విలువైన వస్త్రాలు ఆమె అందానికి హుందాతనాన్ని తెచ్చాయి తనను కౌగిలించుకున్నది ఒక స్త్రీఅని తెలియగానే అతనిలో తెలియని వణకు, చలిజ్వరం ప్రారంభమయ్యాయి.

"ప్లీజ్! నన్ను వదలండి" అన్నాడు విదిలించి. ఆమె కొద్ది దూరంలో ఉన్న అనిల్ కుమార్ బెడ్‌మీద వయ్యారంగా పడుకొంది. అతను తలుపులు తీయబోయాడు.

"ఆగండి! నేను చెప్పబోయేది పూర్తిగా విని తరువాత ఏపనయినా చేయండి" అంది అర్థిస్తున్నట్లు. ఇదెక్కడి ఖర్మరా బాబూ అనుకొన్నాడు. తనెవరు? ఆమె ఎవరు? ఇంత అర్ధరాత్రిపూట ఆమె చెప్పేది, తను వినేది ఏముంది?

"మీరెవరో ముందు చెప్పండి.?" అడిగాడు తలుపులుతీసే ప్రయత్నం విరమించి.

"అదే చెప్తున్నాను. మీరలా కూర్చోండి!" అంటూ కుర్చీ చూపించింది.

అనిల్ కుమార్ అందులో కూర్చొన్నాడు.

"మాది అండర్ బ్రిడ్జి ఇవతల రోడ్డునే అనుకుఉన్న మూడవ మేడ - గోపీరంగుది. పైన భగవాన్ విలాస్ అని వ్రాసి ఉంటుంది. మీకు తెలుసుకదా...." అంది.

గొర్రెల మంద మధ్యలో నిలబెట్టిన గున్న ఏనుగులా ఆ ఏరియాలో ఉన్న భవనాల్లోకెల్లా కొట్టవచ్చినట్లు కనుపిస్తుంది ఆ భవనం. అనిల్‌కుమార్ వెళ్లేదారి అదేగనుక రోజూ చూస్తుంటాడు.

"నా పేరు యూన్సీ. మాకు ఆస్తి పాస్తులు లెక్కలేనంత ఉన్నాయి. నాలుగు బస్సులు, ఏడు లారీలు, మూడు కార్లు ఉన్నాయి. ఒకటి ఇంపాలా, మరొకటి ప్రీమియర్. ఇంకొకటి టయోటా. నేను టయోటా కారులోనే కాలేజికి వెడుతుంటాను. అదంటే నాకు చాల ఇష్టం"

చెప్పడం ఆపి వయ్యారంగా కదిలింది. మన్మథ బాణాల్లాంటి చూపుల్ని గాలిలో విసిరింది. అనిల్‌కుమార్ తల దించుకొన్నాడు భరించలేక. ఇన్నిఉన్నా ఈమనిషికి వచ్చిన కష్టమేమిటో, అన్నీ ఉండడంకూడా ఒకరకమయిన ఇబ్బందేమో! అనుకున్నాడు.

"అన్ని సౌఖ్యాలూ అనుభవిస్తున్న నన్ను ఏదో లోపం బాధించేది. అది ఇదని తేలిసేదిగాదు. ఈ మధ్యనే మిమ్మల్ని చూసిన తర్వాత తెలిసింది నేనుండేది ఒక బంగారు పంజరంలోనని. అందులో బంధింపబడ్డానని. మీలాంటిఅందగాడికిభార్యను కావాలని, మీకౌగిలిలో తనివితీరా కరిగిపోవాలని కలలు కనేదాన్ని"

"అది ముమ్మాటికీ జరగదు" ఖచ్చితంగా చెప్పాడు అనిల్‌కుమార్.

"అవును. మీలాంటి బీదవారికి నేను ప్రేమించినంతమాత్రాన ఇచ్చిపెళ్ళిచేస్తారా? మాఅంతస్తుఎక్కడ? మీఅంతస్తెక్కడ? మీకు మహా ఉంటే లక్ష లుండొచ్చు. కాని మాఆస్తి కోట్లలో ఉంటుంది."

చెప్పడం ఆపి చిరునవ్వు నవ్వింది. అలా నవ్వినపుడు ఆమె పెదవులు వంకర్లు తిరిగాయి. "అలవిగాని ఆస్తి ఉంటే మనుషులు ఇలాగే ఉంటారు. కౌగిలిలో కరిగిపోవాలట. ధనం ఎక్కువయ్యే సరికి పైత్యపు కోరికలు పుడతాయి కాబోలు. ఒక వైపు తిండికి గతిలేక కడుపు మాడ్చుకొనే బీదలు, ఇంకోవైపు లెక్కలేనంత ఆస్తితో విర్రవీగే ధనవంతులు. ఈమె తనను చాలా ఇన్సల్టు చేస్తూ ఉంది. ఎలాగయినా ఈ రాక్షసిని వదిలించుకోవాలి అనుకొన్నాడు.

"డబ్బున్నంతమాత్రాన నాకు గర్వం లేదండీ. చూడండి, ఇంత విలువైన డ్రస్సంటే నాకేమాత్రమూ ఇష్టం లేదు, అందరిలా సింపుల్‌గా ఉండాలని నాకోరిక. కాని మావాళ్ళు వూరుకోరే. అంతస్తట అంతస్తు. నన్ను బొమ్మని చేసి అలంకరిస్తారు" అంటూ మంచం దిగి నిలబడింది.

అనిల్‌కుమార్ రెండుచేతుల్లో గడ్డం అన్చుకొని వూ కొడుతున్నాడు.

అతను వూహించనిపనిచేసింది ఝాన్సీ. శరీరంమీద ఒక్కో బట్టా విప్పేయడం మొదలుపెట్టింది. అనిల్‌కుమార్ కళ్ళు గట్టిగా మూసుకుని "వెళ్ళిపో. వెళ్ళిపో ఇక్కడ్నుంచి" అంటూ అరవసాగాడు.

కాని ఆమె అదేమీ పట్టించుకోకుండా బెడ్‌మీద పడుకొని "ఏమండీ! నాకింత విలువైన బట్టలమీద అయిష్టం అంటే మీరు ఆశ్చర్యపోయి ఉండవచ్చు. కాని నిజానికి నన్ను చూడండి. మీ అభిప్రాయం మారుతుంది" అంది.

అనిల్‌కుమార్ అయిష్టంగానే కళ్లు విప్పి వ్రేళ్ళ సందుల్లోంచి చూశాడు. ఆయువతి ఛాతీమీద తన్ను కొస్తున్న కుచద్వయాన్ని నైట్ క్వీన్ బ్రా లాగి పట్టుకొని ఉంది. దాం తర్వాత

శరీరంమీద ఎల్లోకలర్ లంగామాత్రమే ఉంది. లంగాకు, బ్రాకు మధ్య ఉన్న ఖాళీస్థలం సూర్యాస్తమయ సమయంలో భూమిని ఆకాశాన్ని కలుపుతూ మధ్య ఏర్పడిన సంధ్యాసమయంలా ఉంది.

సహజమైన ఎత్తు పల్లాలతో పుష్కలమైన శరీర సౌష్ఠవం కలిగిన ఆ అమ్మాయిని చూడగానే అతని శరీరం అంతరాంతరాలల్లో జీర్ణించుకొని ఉన్న ప్రకృతిసిద్ధమయిన ఏదో కోరిక అతనిలో జొరబడి ఏమీ తోచనీయకుండా చేసింది.

ఇంతలో ఝాన్సీ లేచివచ్చి సుతారంగా అనిల్‌కుమార్ చేతులు పట్టుకులేపింది. పిల్లిలా ఆమె వెంట నడిచాడు. ఆమె నడుస్తూ అంది.

"నేను ఎన్నాళ్లగానో మీమీద మనసుపడి ఉన్నాను. మీ అందం నన్ను వెర్రెత్తించింది. పెళ్ళి ఎలాగూ కాదు. ఒక్క రోజుయినా మీ భార్యగా గడిపాలనే కోరికతో రహస్యంగా మేడ దిగి ఇలా వచ్చాను. గూర్ఖా తూగుతూ ఉండడం నాకెంతో ఉపకరించింది."

అనిల్‌కుమార్ ఇప్పుడు ఆమె బానిస. ఆమె చేతిలో మైనం ముద్ద అయ్యాడు. గంట తర్వాత అతను దేనికయితే దూరంగా ఉన్నాడో దాన్ని ఆదినుండి అంత్యం వరకూ తెలుసుకొన్నాడు.

సాలోచనగా ఆమెవైపు చూశాడు ఇంకా వెళ్లలేదేమిటా అని. ఆమె అస్తవ్యస్తంగాపడి నిద్రపోతూ ఉంది. అనుభవం తాలూకు సుఖం ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తూ ఉంది. ఆమె అంత తేలిగ్గా వెళ్లేట్లులేదు. అనిల్‌కుమార్‌కి ఏంతోచలేదు. తెల్లవారితో తన పరువు గంగలో కలిసిపోతుంది అ అమ్మాయిని తట్టి లేపుదామంటే మనసు ఒప్పుకోవడంలేదు కోటీశ్వరులయిన

ఆమె తల్లి దండ్రులకు ఈసంగతి తెలిసిందంటే ముందువెనుకలు ఆలోచించకుండా తనుచేసిన పనికి అజన్మ ఖైదు వేయిస్తారు.

అతను ఆలోచనలతో సతమతమవుతూండగానే ఎవరోతలుపు తట్టిన శబ్దమయింది. అనిల్‌కుమార్ గుండె ఒక్కసారి ఆగి మరలా కొట్టుకోసాగింది. తనపరిస్థితి గుర్తొచ్చి "ఏంచేయాల్రా దేవుడా' అనుకున్నాడు. తలుపు చప్పుడు మరీ ఎక్కువయింది. అనిల్‌కుమార్ అస్తవ్యస్తంగా ఉన్న ఆమె బట్టలు సరిజేసి, ఆమె కనిపించకుండా పూర్తిగా బ్లాంకెట్ కప్పేశాడు.

తల దువ్వుకొని, బట్టలు సరిచేసుకొని వెళ్ళి తలుపు తీశాడు. అరవైఏళ్ల వ్యక్తి లోపలికి దూసుకొని వచ్చాడు. నెత్తిన టోపీ, వైంటు పాంటు, వైటుషర్టు, నల్లనికోటు ధరించి ఉన్నాడు. లావుపాటి మీసాలు మెలితిరిగి ఉన్నాయి. కుడిచేతిలో హాండ్ స్టిక్. మణికట్టుమీద వ్రేలాడుతూ రెండుపేటల బంగారు చెయిను. మెడలో కనిపించీ కనిపించకుండా మరో బంగారు చెయిను. చూడగానే కొంత అర్థమయింది. అర్థం కాగానే భయం మొదలయ్యింది.

"బాబూ! ఇటు కేసి ఎవరైనా పాపవచ్చిందా" అడిగాడు ఆగంతకుడు.

అనిల్‌కుమార్ గొంతు తడారిపోగా ఏం మాట్లాడలేక పోయాడు.

మళ్ళీ అతనే అందుకున్నాడు." బాబూ నాపేరు భగవాన్ దాస్. మన వీధి మొదట్లోఉన్న గోపీరంగు మేడ భగవాన్‌విలాస్‌లోనే సుండేది. ఒక అరగంట క్రితం నేను రూములోకి వెళ్ళి చూస్తే మా పాప షూన్సీ లేదు. నేనూ, నాభార్యా భయపడిపోయాము. ఇల్లంతా వెతికాము. కనుపించలేదు. అర్ధరాత్రి సమయంలో స్నేహితుల దగ్గరకు ఎందుకుపోతుంది అనుకున్నాము. మాపూర్వీ

కును జమీందార్లు, బాబూ! పరువుపోతుందని నౌకర్లకికూడా తెలియకుండా నేనూ మా అబ్బాయి నిరంజనదాసూ ఇలా తిరుగుతున్నాం. ఆ గూర్ఖాగాడు మేము వచ్చేదికూడా గమనించకుండా పడి నిద్ర పోతున్నాడు. సగం గేటు తెరుచుకొని ఉంది. వాడే మేలుకుని ఉంటే ఈ అనర్థం జరిగేదికాదు. కిటికీ లోంచి కనపడే లైటు చూసి నీదగ్గరేమయినా సమాచారందొరుకుతుందని వచ్చాము." ముసలాయన కోటు జేబులోంచి ఖరీదైన చేతిగుడ్డ తీసి ముఖం తుడుచుకున్నాడు.

ఇంతలో ఒక పాతికేళ్ళ యువకుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "నాన్నగారూ! పాప ఎక్కడా కనిపించలేదు. నా మనస్సేదో కీడు శంకిస్తూ ఉంది'' అంటూ అనిల్‌కుమార్‌వైపు అనుమానంగా చూశాడు.

ఆ యువకుడు ధరించిన విలువైన వస్త్రాలు జమీందారు. హెూదాను తెలియజేస్తున్నాయి. అతను ఎత్తుగా, దృఢంగా ఉన్నాడు.

అనిల్‌కుమార్ గొంతు తడారిపోయి, ఎక్కిళ్లు కూడా ప్రారంభమాయ్యాయి. భూమి గుండ్రంగా తన నెత్తినే స్పీడుగా తిరుగుతున్నట్లు అనిపించింది. తను ప్రమాదానికి చివరి అంచున నిలబడి ఉన్నాడు. జమీందారు వంశీయులతో తమాషానా!

ఇంతలో భగవాన్‌దాస్ అన్నాడు. "బాబూ! ముసలివాడ్ని. తిరిగి తిరిగీ అలసిపోయాను. కాస్త ఆ చేత్తో ఒక గ్లాసు నీళ్ళిస్తావా!" నీరసంగా అడిగాడు.

అనిల్‌కుమార్ గ్లాసులోకి నీళ్లు నింపి తీసుకువచ్చేసరికి భగవాన్‌దాసూ, అతనికొడుకూ చెరి ఒక కుర్చీలో కూర్చుని ఉన్నారు.

నీళ్ళు తాగి గ్లాసు కింద పెడుతూ— ''మంచంమీదపడుకుని ఉన్నది ఎవరు బాబూ!" అనడిగాడు అనిల్‌కుమార్‌ని.

"నా రూమ్‌మేటు, సార్!''

"అలాగా! కొద్దిగా లేపండి మాట్లాడుదాం."

"పాపం అతనికి రెండు రోజుల నుంచి మంచి నిద్ర లేదు సార్! లేవగొట్టొద్దని నాకు ముందుగా చెప్పాడు" అనిల్‌కుమార్ గుండె వేగంగా కొట్టుకోసాగింది.

''ఏం ఫరవాలేదు. విషయం చెబితే ఏమనుకోడులే. బాబూ"

''అయామ్, సారీ, సార్! ఎట్టి పరిస్థితిల్లోనూ లేపొద్దని ఖచ్చితంగా చెప్పాడు. లేపడం బాగుండదు.''

"ఎందుకండీ అట్లా భయపడిపోతారు. మిమ్మల్నేమయినా అంటాడనా. మిమ్మల్నంటే మేమూరుకొంటామా! తోలు వలిచేయమూ" అన్నాడు నిరంజనదాసు కోపంగా.

''ఎందుకండీ అంత ఆవేశపడతారు. అబ్బాయిగారూ! బాబూ అబ్బాయిగారు చెల్లెలు కనుపించని దుఃఖంలో ఏదేదో అంటున్నారు. మీరదేమీ పట్టించుకోకండి. మీ ఫ్రెండుని లేపండి. ఫరవాలేదు".

అనిల్‌కుమార్‌కు జరుగబోయే పరిణామాలేమీ అర్థం కావడంలేదు. ముసలాయన మాటల్ని ఖాతరుచేయక, మొండి ధైర్యంతో గంభీరంగా నిలబడి ఉన్నాడు.

రెండు నిమిషాలు చూసి భగవాన్‌దాస్ కుమారుడు నిరంజన్‌దాస్ మంచాన్ని సమీపించి ''ఏమిండీ కొద్దిగా లేస్తారా మీతో మాట్లాడాలి.'' గట్టిగా పిలిచాడు.

ఝాన్సీ నిద్రలో మత్తుగా మూలిగింది.

అనిల్‌కుమార్ కళ్లప్పగించి చూస్తున్నాడు. జరగబోయే ప్రమాదాన్ని వూహించుకుంటూ ఉంటే భయంగా ఉంది. రక్తం చల్లబడిపోయింది. గుండె గొంతులో కొట్టుకోసాగింది. జరగబోయే దాని ఫలితం, తరువాత తన భవిష్యత్తు గుర్తుకు రాసాగాయి.

నిరంజన్‌దాస్ పిలవడం, లోపల నుంచి మత్తుగా మూల గడం, అటూ ఇటూ దొర్లడం తప్ప దుప్పటి తొలగలేదు. దాంతో వళ్ళు మండిన నిరంజన్‌దాస్ దుప్పటి పూర్తిగా లాగి పారేశాడు. బ్రా, లంగాతో అర్ధనగ్నంగా ఉన్న చెల్లెల్ని చూసేసరికి అతని గుండె మండింది. కళ్ళు రెండూ గట్టిగా మూసుకున్నాడు. భగ వాన్‌దాస్ ముఖం వెలవెలా పోయింది. ఏ క్షణంలో మూర్ఛ బోతాడా అన్నట్లున్నాడు.

''ఝాన్సీ'' కళ్ళమీదనుంచి చేతులుతీసి అరిచాడు. అతని ముఖం కందగడ్డలా అయింది. భగవాన్‌దాస్ పరుగెత్తుకుంటూ వచ్చి కుమారుడి నోరు మూశాడు. ''బిగ్గరగా అరవకండి నిరంజన దాస్‌గారూ! మనపరువుపోతుంది. మీరు మాట్లాడకండి. అన్నీ నేను చూసుకుంటాను. గది తలుపులు కిటికీలు అన్ని మూసి ఉన్నాయో, లేదో చూసి రండి" అని ఆదేశించాడు.

గావు కేకకు కళ్ళు తెరిచిన ఝాన్సీ రెండు పులుల మధ్య మేక పిల్లలా మంచందిగి నిలబడి సన్నగావణకసాగింది. దుప్పటి వళ్లంతా కప్పేలాగ మెడచుట్టూ చుట్టుకుని రెండుచేతులు ముడుచుకుని ఒకవారగా నిలబడింది.

"ఏమిటయ్యా. ఈపని దుప్పటిలో ఎవరు పడుకుని ఉన్నారూ అంటే స్నేహితుడన్నావ్. లేపొద్దన్నా డన్నావ్. తీరా అందులో చూస్తే ఎవరున్నారు! నా బంగారు కూతురు."

"ఏం చేశావ్ మాచెల్లెలిగార్ని. చెప్పుముండు. నీబెడ్‌మీదికి ఎలా వచ్చి పడుకొంది'' ఉరిమాడు నిరంజన్‌దాస్.

"నాకేం తెలియదు. ఆమే వచ్చి పడుకుంది''

"ఏమిటి నాచెల్లెలుగారా! అటువంటిది కానేకాదు. ఏమ్మా" అన్నాడు ఆమె వైపు చూసి.

ఆమె గజగజ వణకుతూ అంది "అన్నయ్యగారూ! నాకేం తెలియదండి. నేను నాగది వరండాలో చదువుకుంటున్నాను. కొద్ది సేపటికి ఎందుకో బోర్‌కొట్టింది పరీక్షలు దగ్గరకువచ్చాయి కదా. ఇంకొద్ది సేపు మేలుకుని ఉండాలని ఫ్లాస్కులోంచి టీ వంచుకుని కొద్దిగా తాగాను. కొద్దిసేపు అలా తిరుగుదామని కిందికి వచ్చాను. గూర్కా నిద్రపోతున్నాడు.''

"అవును. వాడొట్టి దద్దమ్మ. తల్లీ! వాడ్ని సస్పెండు చేసి రేపే ఇంకొకడ్ని పెడతాను. తరువాత ఏం జరిగింది తల్లీ?" భగ వాన్‌దాస్ ఆతృతగా అడిగాడు.

''అదే. వాడు నిద్రపోతున్న విషయం ఋజువు చెయ్యాల ని, స్టూలు పక్కనే పడివున్న తాళాల తీసుకుని మెయిన్‌గేటు నుంచి బయటకు వచ్చాను. అంటే నాఉద్దేశ్యం గేటు అవతల నుంచి గూర్కాను లేపితే అతను డ్యూటీ ఎంతమాత్రం చేస్తున్నాడ నేది అతను ప్రాక్టికల్‌గా తెలుసుకుంటాడని.''

"'అయ్యో! నాచెల్లెలుగారికి ఎంత తెలివి. జమీందారి వంశీ యులంటే మాటలా! తరువాత ఏం జరిగిందమ్మా."

"అలా వీధిలోకి వచ్చి మెయిన్‌గేటు తలుపులు దగ్గరకు వేశానా! బయటనుంచి ఇక గూర్కాను పిలుద్దామనుకుంటున్నాను. ఇంతలో చీకట్లో కనిపించకుండా గోడచాటున ఆగిఉన్నా రిక్షా నాపక్కనొచ్చి ఆగింది. నేను భయపడి అరిచాను. రిక్షాలోంచి

ఈ పెద్దమనిషి దూకి శబ్దం బయటకు రాకుండా నానోరు మూశాడు. తరువాత రిక్షావాడి సాయంతో నన్నిక్కడకు తీసుకొచ్చిపడేయడం జరిగిపోయింది".

భగవాన్‌దాస్ చిన్నగా రోదించాడు. ''అమ్మా! నీకెన్ని బాధలు వచ్చాయి ఈవిషయం ఎవరికయినా తెలిస్తే మన స్టేటస్ మన గౌరవం ఏమయిపోతాయమ్మా. ఎవరికీ తెలియనీయకుండా నిన్ను వెదుక్కుంటూ నేనూ, అనయ్యగారు ఇలా వచ్చామమ్మా.''

"యూ ఇడియట్!'' ఆగ్రహావేశాలతో పిడికిలి బిగించి ముందుకువచ్చిన కుమారుడ్ని ఆగమన్నట్లు చేయెత్తి వారించాడు. భగవాన్‌దాస్. తరతరాలుగా తండ్రి మాట జవదాటని కుటుంబం కావడంతో నిరంజన్‌దాస్ ఆగిపోయాడు. జరిగిన అవమానానికి అతని గుండె ఎగసి ఎగసి పడుతూ ఉంది.

''తల్లీ! ఇంకేవయినా జరగకూడనివి జరిగాయా" దగ్గరకు వెళ్ళి తలనిమురుతూ అడిగాడు భగవాన్‌దాస్.

''అవునునాన్నగారూ! అంతాఅయిపోయింది. ఇక నాజీవితం వ్యర్థం మీ వంశానికి అప్రతిష్ట తెచ్చిన నేను బతకూడదు. ఇప్పుడే ఈక్షణమే విషం తాగి మరణిస్తాను. మీకు అపకీర్తి రాకూడదు. గుప్పెడు విషం కాఫీలో కలిపి ఇవ్వండి. సడన్‌గా ఏదో జబ్బుచేసి చనిపోయిందని లోకానికి తెలియజేయండి, అంతే కాని నన్ను క్షమించకండి." ఝాన్సీ తండ్రి కాళ్ళమీదపడి ఏడ్చింది.

ముసలాయన విషయం వింటూనే స్పృహ తప్పి నేలకు ఒరిగి పోయాడు. కొడుకు శుశ్రూషకు కళ్ళు తెరిచాడు. తరువాత నెత్తీనోరు కొట్టుకున్నాడు. గుండె బాదుకున్నాడు. ఎప్పుడు సుఖాలలో తేలియాడె కోటీశ్వరుడి ఇప్పటి పరిస్థితి జాలి కలిగించక మానదు. పక్కనేఉన్న నిరంజనదాసు తేరుకుని బెల్టు వూడదీసి

కుడిచేతిలో బిగించి పట్టుకున్నాడు. అది పాముల వాడిచేతిలోని పాములా వేలాడుతూ వదిలితే కరవడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. తండ్రి ఆజ్ఞ కోసం ఎదురు చూడసాగాడు.

భగవాన్‌దాస్ దృష్టి దీని కంతటికీ కారణమయిన అనిల్ కుమార్ వైపు మళ్ళింది. "ఓరి దుర్మార్గుడా! ఇంతపని చేయడానికి నీ కెన్ని గుండెల్రా! ఇప్పటివరకూ నీవు మంచివాడివనే అనుకున్నాను. నాపేరంటే ఈ ఆంధ్రాఅంతా తెలుసు. ఈ ప్రాంతంలో ఇంత ఆస్తిపరుడులేడు. అటువంటిది నాఏకైక కూతురుని చెరచడానికి నీకెన్ని గుండెల్రా?" కోపం ఎక్కువై పళ్ళు కొరకసాగాడు.

"నాన్నగారూ! నాకు అనుమతి ఇవ్వండి. వాడి చర్మం వలిచేస్తాను." మాటలు చిన్నవిగాఉన్నా వాటిలో కాల్చివేసే వేడి ఉంది.

అనిల్‌కుమార్ శూన్యంలోకి చూస్తున్నాడు. తిని కొవ్వెక్కి కామంతో కళ్ళు కనపడని ఆడది ఏది మంచో, ఏది చెడో గమనించకుండా కనపడ్డ వాడితో కామదాహం తీర్చుకుంది. ఆడది ఎప్పుడూ అవకాశవాది. పరిస్థితులు తారుమారు అయ్యేసరికి తప్పంతా తనమీద నెట్టేసింది. ఆడదాన్నినమ్మకూడదని ఇప్పుడు మరోసారి తెలిసింది. గదిలోకి రాగానే పోలీసు రిపోర్టు ఇచ్చి ఉండవలసింది అనుకున్నాడు. ఈ సంఘటనతో రెచ్చిపోయాడు. కోపాన్ని మనసులోనే అణుచుకున్నాడు.

"'ఏమయ్యా పెద్దమనిషి పలకవ్" అన్నాడు భగవాన్‌దాస్.

"నేనేం చెప్పేదండీ. ఆ అమ్మాయి చెప్పేదంతా అబద్ధం. అ అమ్మాయి తనకై తాను నా రూముకు వచ్చిందంటే నమ్మరే ''

''నాన్నగారూ! అన్నయ్యగారూ! నన్ను నమ్మండి. నేను చెప్పేది నిజం'' బోరున ఏడుస్తూ అంది అంది రూన్సీ. ఆమె ముఖం నిష్కల్మషంగా అద్దాన్ని నీటితో కడిగినట్లుంది.

"ఇదిగో అబ్బాయ్! నేను చెప్పేది విను. పోలీసు రిపోర్టు ఇస్తే నీకు పడబోయే శిక్షేమిటో తెలుసా. లైఫ్. ఐ. పి. సి. మూడు వందలా డబ్భైఐదవసెక్షను ప్రకారం నీకు లైఫ్ పడుతుంది. లేదంటే పదేళ్ళకు తగ్గదు జైలు.''

అనిల్‌కుమార్ పళ్ళు కొరికాడు ముందు ఝాన్సీ తరువాత తండ్రి కొడుకుల్ని నాలుగు తన్ని తరమాలన్నంత కోపం వచ్చింది.

''మీరు రూరుకోండి, నాన్నగారూ, వెళ్ళి పోలీసులకు ఫోన్ జేస్తాను."

"త్వరపడి అలా చేయకండి. అబ్బాయిగారూ, పోలీసులకు ఫోను చెయ్యడం గొప్ప విషయం అని అనుకోకండి. తరువాత మన పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి. అమ్మాయిగారిని వివాహం చేసుకోవడానికి ఇక ఏపిల్ల జమీందారూ ముందుకు రాడు."

దీర్ఘాలోచనలో పడిపోయాడు నిరంజనదాసు. "అయితే ఇతన్ని వదిలెయ్యడమేనా, దానికి నే నొప్పుకోను. వీడి అంతు తేల్చేస్తాను."

"అదే నేనూ అలోచిస్తున్నాను. అటు మన పరువుపోకుండా తగిన శాస్తి చేయాలి." తిడుతూనే ఉన్నాడు. సమయం గడిచిపో సాగింది.

"వీడ్నిసఫాచేస్తాను." అఖరుగా అన్నాడు నిరంజనదాసు.

ఈమాట వినేసరికి అనిల్‌కుమార్‌లో పౌరుషం కోడిపుంజు తల నిగిడినట్లు నిగిడింది. విజయమో, వీరమరణమో, తప్పు తనది కానప్పుడు వీళ్లకెందుకు భయపడాలి అనుకొన్నాడు. అన్నింటికి తెగించి తనూ యుద్ధానికి సిద్ధమయ్యాడు.

"ఏమిటీ? చంపుతా నంటరా? అది మన ఇంటా, వంటా లేదు. మనది సూర్య వంశానికి చెందిన కుటుంబం. నిరంతరం దానాలుచేస్తూ ఎన్నో జీవితాలను కాపాడిన చేతులు మనవి. వాటితో అప్రదిష్టపు పనులుచేయకండి." అరిచాడు భగవాన్‌దాసు.

తరువాత కొడుకుని తీసుకొని బయటికి వెళ్ళాడు. అనిల్ కుమార్ అప్పటివరకూ క్రొత్త కథ వినిపించిన ఝాన్సీ వైపు ఉరిమి చూశాడు. ఏడుపు ముఖం పెట్టిన ఝాన్సీ, తన తండ్రి. అన్నయ్య అలా బయటికి వెళ్ళగానే అనిల్‌కుమార్ వైపు చూసి గాలిలో వో ముద్దు విసిరి కొంటెగా చూసింది. ఒళ్ళు భగ్గున పడింది అనిల్ కుమార్‌కు.

"మీరీ ప్రమాదంలోంచి బయటపడాలంటే మార్గం నేను చెబుతాను" అంది ఝాన్సీ చిన్నగా.

"ఏమిటి?" అడిగాడు గత్యంతరం లేక.

"ఇది జరిగిన తర్వాత మనఇద్దరికి పెళ్ళిచేస్తారనుకొన్నాను. కాని, మావాళ్లు ఒప్పుకొనేట్లు లేరు. మనకు అంతస్తులు అడ్డు వస్తున్నాయి కనుక మావాళ్ళు వంశ ప్రతిష్టలు నాశనమవుతాయని భయపడుతున్నారు."

"అయితే!"

"ఇంకొక మార్గముంది. మా నాన్నగారికి డబ్బు పిచ్చి ఎక్కువ. మీరో పాతికవేలు మా నాన్నగారికి ఇస్తానని చెబితే ఈవిషయంలో క్షమించవచ్చు. మానాన్నగారిమాటే మాఅన్నయ్య గారికి వేదవాక్కు. కనుక దీనికి ఒప్పుకుని వదలిపెట్టవచ్చు."

అనిల్‌కుమార్‌కు అంత బాధలోనూ నవ్వు వచ్చింది. వంశ ప్రతిష్టలుట. వంశప్రతిష్టలకోసం తమ సర్వాన్ని త్యాగంచేసిపిర

మరణం చెందినవాళ్ళు, బికారులయినవాళ్ళు ఉన్నారు. కాని ఇలా డబ్బు కోసం వంశ ప్రతిష్ఠలు పోగొట్టుకొనే వాళ్ళు లేరు. తనదగ్గర డబ్బెక్కడిది. ఊడ్చి తన్నినా ఈనెల జీతం తప్ప మరేమీ లేదు. అయినా వాళ్ళకు తనెందుకు డబ్బివ్వాలి?

ఈ లోపల తలుపులు తీసుకొని తండ్రీ, కొడుకులు లోపల ప్రవేశించారు.

"నేను మీ అమ్మాయిని పెళ్ళిచేసుకోదలిచాను." వాళ్ళేదో అనబోయే లోపల అనిల్‌కుమార్ అన్నాడు. అతనికి కల్లాకపటం తెలియని ఒక అమ్మాయి శీలం దోచేశానే అనే పశ్చాత్తాపం ఒక వైపు వుంది.

దాంతో వాళ్ళొక్కసారిగా ఉలికిపడ్డారు. ఝాన్సీ కళ్ళు ఆనందంతో మెరిశాయి. ఝాన్సీవైపు ప్రశాంతంగా చూసిన వాళ్ళ కళ్ళు క్షణంలో రంగులు మారాయి.

"హు!.....మేమెవరమనుకొన్నావు. నీతో మాకు వియ్యమా? నక్కకూ, నాగలోకానికి ఎంత తేడా! ఎక్కడైనా చీమలు, సింహాలతో స్నేహం చెయ్యడం చూశావా! మేము నలుగురిలో తలెత్తుకొని తిరగాలనే నువ్వీమాటంటున్నది. పరాభవాగ్నితో ఇప్పటికే దహించుకుపోతున్న మాతో పరచికాలాడుతావా?" హుంకరిచాడు భగవాన్‌దాసు.

అనిల్‌కుమార్ మవునంగా ఉండిపోయాడు.

"ఇప్పుడు మేము ఏం నిర్ణయించుకొన్నామో తెలుసా. పోలీసు రిపోర్టు ఇవ్వాలని. మా సంగతి బయటకు రాకుండా నిన్ను లోపల తోసెయ్యాలని." నిరంజన్‌దాసు గద్దించాడు.

పోలీసు రిపోర్టు ఇస్తే సహజంగా తప్పు తనదేనని తెలుస్తుంది. తనకు తప్పక జైలు శిక్ష పడుతుంది. దాంతో ఉద్యోగం

పోతుంది. ఇక ఆలోచిస్తే లాభంలేదు. ఝాన్సీ చెప్పిన రెండో ఉపాయం ప్రయోగించి చూడాలి అనుకున్నాడు.

"జరిగిందేదో పొరపాటు. తప్పు నాదే కనక ఎంతో కొంత డబ్బు తీసుకుని నన్ను వదలివేయండి." అన్నాడు అనిల్‌కుమార్ తలవంచుకుని.

"చేసిన నీచపుపనిని డబ్బుతోలెక్క గడుతావా, దుర్మార్గుడా" హూంకరిస్తూ మీదిమీదికి రాబోతున్న నిరంజన్‌దాసును ఆపాడు భగవాన్‌దాసు.

"మీరూరుకోండి అబ్బాయిగారూ! ఉభయులకూ శ్రేయస్కరమైన పని మన మాలోచించాలి. ఇంతకీ ఎం తిస్తానంటావ్" అన్నాడు డబ్బు మనిషి భగవాన్‌దాసు. అతని కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి.

డబ్బు విషయంలో తండ్రి వీక్‌నెస్‌కు కోపం వచ్చినా, తండ్రికి ఎదురుచెప్పలేక అసహ్యంగా అటు తిరిగి నిలబడ్డాడు.

"అయిదు వేల రూపాయ లివ్వగలను."

"అయిదు వేలేమిటి. పాతిక వేలయినా ఇవ్వందే ఈ కేసు డ్రాప్ చేసుకోను."

ఇద్దరికీ వాదోపవాదం పెరిగింది. అనిల్‌కుమార్‌కి ఇది ఇష్టం లేకపోయినా ప్రమాదంలోంచి తప్పించుకోవడంకోసం దేనికైనా సిద్ధంగా ఉన్నాడు.

అరగంట తర్వాత బేరం పది వేలకు తెగింది.

"నేను రెండు రోజుల్లో ఆ మొత్తం మీ ఇంటికి చేరుస్తాను. ప్రస్తుతం నాదగ్గర ఈనెల జీతం తప్ప మరేమీ లేదు."

"ఏమిటీ డబ్బు లేకుండానేనా. ఇంతసేపు బేరంచేసింది. ఏం పెద్దమనిషివయ్యా నువ్వు. ఈవిషయం బయటకు పొక్క

కూడదని ఎంత కప్పిపుచ్చినా నువ్వు నాదారికి రావడం లేదు" అన్నాడు కోపంగా.

అటు తిరిగి ఉన్న నిరంజనదాసు చివ్వున తల తిప్పాడు. ఏం మాట్లాడలేదు. పళ్ళు కొరికాడు. బెడ్‌మీదఉన్న బ్లాంకెట్ కింద పరిచి గదిలోఉన్న పది జతలు టెరీకాటన్ బట్టలు, రేడియో, ఆటో మెటిక్ ఐరను బాక్సు, టేప్‌రికార్డర్, అలారం టైంపీసు అందులో ఉంచాడు. టేబులు మీదున్న అనిల్‌కుమార్ ఎలక్ట్రానిక్ వాచ్ జేబులో వేసుకున్నాడు. లాక్‌చేయకుండా వదలిన బ్రీఫ్‌కేసు తెరిచి అందులోఉన్న రెండు వేలు జీతం జేబులో కుక్కుకున్నాడు.

వస్తువుల్ని దుప్పట్లో మూటగా కట్టి పట్టుకుని "నాన్న గారూ! నాలుగు కావచ్చింది. హోటళ్ళ వాళ్ళు లేస్తారు. మన పరువు పోతుంది. వెళదాం పదండి" అంటూ ముందుకు నడిచాడు. వెనకనే భగవాన్‌దాసు, ఈలోపల చీరలో ముస్తాబయిఉన్న ఝాన్సీ అతన్ని అనుసరించారు. అంత పెద్దభవనంలో ఏదోమూల నిద్రి స్తున్న వృద్ధ దంపతులకు ఈవిషయం తెలియదు.

వాళ్ళు రోడ్డున పోతున్న ఆటోని ఆపడం, అందులో అందరూ ఎక్కడం కిటికీలోంచిచూస్తున్న అనిల్‌కుమార్‌కు స్వప్నం లోంచి చూస్తున్నట్లుగా ఉంది. ఇది కల కాదు యథార్థం అని తెలియజేస్తూ సమీపంలోని స్టేషన్‌లోంచి రైలు బిగ్గరగా కూసింది.

అనిల్‌కుమార్ సుస్తీగా ఉందని బాంకుకు సెలవు పంపించి గదిలోనే ఉండిపోయాడు. పోయినవస్తువుల్ని ఇంట్లో వాళ్ళకు ఏ పద్ధతిలో తెలియజేయాలాన్నఅని ఆలోచిస్తున్నాడు. మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో పోస్టుమన్ ఒక కవరందించి వెళ్ళి పోయాడు. అది లోకల్‌గా పోస్టుచేయబడ్డ ఉత్తరం. ఫ్రం అడ్రసు లేదు. కవరు చించాడు.

"ప్రియమైన అనిల్‌కుమార్‌కు ఝాన్సీ నమస్కరించి వ్రాయడం."

మొదటి వాక్యానికే అనిల్‌కుమార్ వళ్లుమండింది 'రాస్కెల్ ఇంకా నన్ను వదలిపెట్టలేదు' అనుకుంటూ పళ్లు కొరుక్కున్నాడు.

"నా మీద మీకు చెప్పరాని అసహ్యం ఉంది కదూ. స్త్రీ జాతినే సమూలంగా నాశనం చేయాలనుకుంటున్నారు కదూ. రాత్రి మీకళ్ళలో కనబడ్డ కసీ, ముఖంలో కనిపించిన వేదన, శరీరం మీద నిక్కబొడుచుకున్న రోమాలు ఈవిషయం తెలియ జేశాయి.

నా కథ విని మీరు ఏనిర్ణయానికి వచ్చినా నాకంగీకారమే. నా దొక విషాద గాథ. మా నాన్నకు అరుగురం సంతానం. మా నాన్న బడిపంతులుగా నేను బి.ఎ. ఫైనలియరు చదువుతూండగా రిటయిరయ్యాడు. దాంతో నేను కాలేజీ మానేసి మా నాన్నకు తోడుగా ట్యూషన్లు చెప్పాల్సి వచ్చింది. తరువాత ప్రైవేటుగా బి. ఏ. ప్యాసయ్యాను. మరుసటి సంవత్సరమే మా నాన్న చని పోయాడు. వృద్ధురాలైన తల్లి, పెళ్ళి కెదిగిన చెల్లెళ్ళు, చదువు కుంటున్న తమ్ముళ్ళకు నేనే అధారమయ్యాను. ఉద్యోగం కోసం ఎన్నో బాధలు పడ్డాను. ఎక్కడా దొరకలేదు. ఇంట్లో పరిస్థితి కటకట అయిపోయింది. కట్టుకోను సరియైన బట్టల్లేని నా చెల్లె ళ్ళను, కడుపునిండా తిండిలేని తమ్ముళ్ళను, నీరసంగా తూలి పోయే తల్లిని చూస్తూ ట్యూషన్లమీద వచ్చే డబ్బుతో ఒకపూట తిని ఇంకోపూట తినక పస్తులు గడుపుతున్న నాకు ఒకప్రైవేటు ఫర్మ్ మేనేజరుతో పరిచయమయ్యింది.

అతను ఒకరోజు ఉద్యోగమిస్తాను రమ్మన్నాడు. నమ్మి అతని గదికి వెళ్ళిన నన్ను అనుభవించి, వంద రూపాయలు

చేతిలో పెట్టాడు. ప్రస్తుతానికి ఉద్యోగంలేదని, ఏవైనా ఖాళీలొస్తే తప్పక నాకే ఇస్తానని, అప్పుడప్పుడూ తన రూముకు రావచ్చని వచ్చినప్పుడల్లా ఎంతో కొంత ఇస్తానని పలికాడు. నాకు పిచ్చిఎత్తి నట్లయింది. వంద రూపాయలనోటు వాడిముందే ముక్కలుచేసి, ఆ ముక్కల్ని వాడి ముఖాన్నే చల్లి, ఏడుస్తూ బయటికి పరు గెత్తాను. ఆ సాయంత్రం వరకూ ఏం తోచక, ఎడారిలో నీళ్ళ కొరకు వెతికినట్లు వూరంతా వెతికాను. ఆ సాయంత్రం హుసేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న నన్ను ఇద్దరు వ్యక్తులు పరుగెత్తుకువచ్చి పట్టుకొన్నారు. వాళ్ళని చూసి బావురుమన్నాను. వాళ్ళెవరోకాదు, నాక్లాసుమేట్సు నారాయణ, దేవదాసు. వాళ్ళకు విషయమంతా చెప్పాను. కాని ఆ దుర్మార్గుడి అడ్రసు ఇవ్వలేదు

"నేను శీలం పోగొట్టుకొన్న దాన్ని. ఎవరికోసం బ్రతకాలి" అన్నాను.

'నీకోసం, నీసోదర సోదరీమణులకోసం' అన్నారు వాళ్ళు.

వాళ్ళూ నిరుద్యోగులు. నాటకాల కంపెనీలోచేరి వేషాలు వేస్తున్నారట. నన్ను రమ్మన్నారు. ఆలోచించి సరే అన్నాను. కాని ఏంలాభం. అక్కడా కాంపిటీషను. సీజనులోనే డ్రామాలుంటాయి. అదీకాక నాలాంటి ఆడదానికి వాళ్ళ చేతుల్లో శీలం పోగొట్టుకోవల సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి నలిగిన పువ్వు దారిలో పడి ఉంటే అందరిచేతా త్రొక్కబడి అథఃపాతాళానికి పోతుంది. వేశ్యాగృహాలే స్వగృహాలవుతాయి. అంతకంటె రహస్యంగా వ్యాపారం చేసుకొంటూ అందరు పెద్దమనుషుల్లా ఈ సంఘంలో ఎందుకు బ్రతకకూడ దనుకొన్నాను. అందుకే సరికొత్త నాటకం తయారుచేసి నాస్నేహితులకు చెప్పాను. అందుకు వాళ్ళు ఒప్పుకో లేదు. నన్ను మందలించారు. చివరకు నేను ఆత్మహత్య చేసు

కుంటా ననడంతో సరే నన్నారు. అదే మేము నిగదిలో ఆడిన నాటకం. నేను ఖూనీగా, నామిత్రులు భగవాన్‌దాసు, నిరంజన దాసులుగా నటించి అసలు వ్యక్తులము మేమేనని మిమ్మల్ని నమ్మించాము. పెద్ద పెద్ద పట్టణాలలో మకాం వేయడం, అక్కడ గొప్ప ఉద్యోగస్థుల్లో పరువుకోసం ప్రాకులాడే మీలాంటి అమాయకుల్ని, కామాంధకారంతో కళ్ళుమూసుకుపోయిన వాళ్లను, పగలు నీతిగాను, చీకట్లో అవినీతిగాను వ్యవహరించే మహానుభావుల్ని పసిగట్టి ఆ ప్రాంతానికి తగ్గపేర్లు చిరునామాలుమారుస్తూ బ్లాక్ మెయిలుచేసి రోజులు గడువుతున్నాము.

బ్రతకడానికి మార్గం ఇదా? అని మీరసహ్యించుకోవచ్చు. తినడానికి తిండిలేక, కట్టడానికి బట్టలేక, నిలువ నీడలేక నాలాంటి అభాగ్యులు కూటికోసం చేసేది తప్పా? ఇదే తప్పయితే, ఇంత చదువుకొని ఉద్యోగం లేని మాకు ఏది దారి? అని ప్రశ్నిస్తున్నాను. ఈ ప్రశ్నకు బదులివ్వగలరా ? మీరు ఇవ్వలేరు. మీరేకాదు ఎవరూ ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేరు. ఏది ఏమయినా మీరు తెలిసి చెప్పినా, తెలియక చెప్పినా, "నిన్ను పెళ్ళిచేసుకొంటాను" అన్న మాటలు నాకే కాదు. మా స్నేహితులకుకూడా ఎంతో ఆనందాన్ని కలిగించింది. కాని ఈ ప్లాస్టిక్ పువ్వును మీకు సమర్పించుకోలేను. అందరూ త్రాగుబోతుల్ని, వేశ్యాలోలుర్ని ఇంత వరకూ మోసగించాము. మీనిష్కల్మషమైన హృదయం మాలో ఎంతో మార్పును కలుగజేసింది. మేము ఈవ్యాపారానికి ఇంతటితో స్వస్తి చెబుతున్నాము. మీ వస్తువులు మీకు తిరిగి ఇచ్చే అవకాశం లేదని తెలియజేస్తున్నందుకు క్షమించండి. ఇప్పుడు ఎన్నో మైళ్ళ దూరంలో ప్రయాణం చేస్తుంటాను. రాత్రి రైల్వే స్టేషన్లో ఈవుత్తరం తయారుచేశాను.

ఇప్పుడు చెప్పండి. ఇంకా నన్ను పెళ్ళిచేసుకుంటా నంటారా?

ఎన్నో క్షమాపణలతో,
మీ ఝాన్సీ.

అనిల్‌కుమార్ కళ్ళలోంచి నీరు ఉబికింది. అతని గుండె ఆవేదనతో నిండిపోయింది. అతను జరిగిపోయిన నష్టాన్ని గురించి ఆలోచించడం లేదు. జారిపోయిన వజ్రాన్ని గురించి బాధపడు తున్నాడు. "అవును! ఝాన్సీ! నీ వడిగిన ప్రశ్నకు నేనే కాదు మహా మహా మేధావులు కూడా జవాబు చెప్పలేరు. బాగా అభి వృద్ధి చెందిన దేశాల్లోనే అనెంప్లాయిమెంటు ఉంది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకొన్నా అనెంప్లాయిమెంటు పెరిగిపోతూనే ఉంది. ఈ ప్రాబ్లెమ్ మానవలోకం ఉన్నంతకాలం ఉంటుంది." అనుకొన్నాడు.

"ఝాన్సీ నీకథంతా వినికూడా నిన్నే పెళ్ళిచేసుకోవడానికి నా మనసు ఉవ్విళ్ళూత లూగుతోంది, ఝాన్సీ! నీ నిష్కల్మష హృదయం, చేసిన తప్పు ఒప్పుకోవడం నీ త్యాగ నిరతి నన్ను ముగ్ధున్ని చేశాయి! మళ్ళీ ఒకసారి కనిపించు ఝాన్సీ. మళ్ళీ ఒక సారి కనిపించు వేదనతో తల పట్టుకొన్నాడు అనిల్‌కుమార్.

★